# భారత దేశంలో అవ్యవస్థీకృత రంగం

నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ 2004 -2005 సంవత్సరంలో చేపట్టిన సర్వే ప్రకారం దేశంలో మొత్తం 45.9 కోట్లమంది ఉద్యోగులు ఉండగా వారిలో సుమారు 2.6 కోట్లమంది వ్యవస్థీకృత రంగంలో ఉన్నారు. తక్కిన 43.3 కోట్లమంది అవ్యవస్థీకృత రంగంలో ఉన్నారు. ఈ అవ్యవస్థీకృత రంగంలో పనిచేసే 43.3 కోట్లమందిలో 26 .8 కోట్ల మంది వ్యవసాయ రంగంలో, 2.6 కోట్లమంది నిర్మాణ రంగంలో, మిగిలిన వారు వస్తూత్పత్తి, సేవా రంగాలలో పనిచేస్తున్నారు.

అవ్యవస్థీకృత రంగంలో పనిచేసేవారికి సామాజిక భద్రత మరియు సంక్షేమం కల్పించేందుకు, ప్రభుత్వం రెండంచెల ప్రణాళికను చేపట్టింది. ఒకటి చట్టపరమైన చర్యలు కాగా రెండోది - సంక్షేమ పథకాల, కార్యక్రమాల అమలు. 1948 సంవత్సరంనాటి కనీస వేతనాల చట్టం; 1923 సంవత్సరంనాటి శ్రామిక పరిహార చట్టం; 1961 సంవత్సరంనాటి మాతృత్వ సహకార చట్టం; 1976 సంవత్సరంనాటి వెట్టి చాకిరీ (నిర్మూలన) చట్టం; 1970 సంవత్సరంనాటి గుత్త కూలీ (నియంత్రణ & నిర్మూలన) చట్టం; 1979 సంవత్సరంనాటి అంతర్రాష్ట్రీయ వలస కూలీల (ఉద్యోగ మరియు పనిచేసే పరిస్థితుల క్రమబద్ధీకరణ) చట్టం; 1966 సంవత్సరంనాటి భవనాలు మరియు ఇతర కట్టడాల కార్మికుల (ఉద్యోగ మరియు పనిచేసే పరిస్థితుల క్రమబద్ధీకరణ) చట్టం వంటి చట్టాల అమలు శాసనపరమైన చర్యలు.

అవ్యవస్థీకృత రంగంలో పనిచేసే నేతకార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, తోలు పరిశ్రమ కార్మికులు, తోటల్లో పనిచేసే వారు, బీడీ కార్మికులు వంటివారి సంక్షేమం కొరకు 2008 సంవత్సరంలో కార్మిక మరియు ఉద్యోగ మంత్రిత్వ శాఖ అవ్యవస్థీకృత కార్మిక సామాజిక భద్రతా చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం కింద ఏర్పాటైన జాతీయ సామాజిక భద్రతా బోర్డు, జీవిత మరియు వైకల్య భీమా, ఆరోగ్య & మాతృత్వ సహకారం, వృద్ధుల సంరక్షణ వంటి సామాజిక భద్రతా పథకాలకు రూపకల్పన చేస్తుంది. ప్రభుత్వం అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు ఇటువంటి సహాయాలను అందించడానికి, ఈ మంత్రిత్వ శాఖ జాతీయ సామాజిక భద్రతా బోర్డును ఏర్పాటు చేసింది.